క్లుప్తంగా

విశ్వనాథునికి రుద్రాభిషేకం



మనుబోలు: మండలంలోని మనుబోలు చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథ స్వామి ఆలయంలో సోమవారం అర్చకుడు శ్రీనివాసులు రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. గ్రామానికి చెందిన మాసు మస్తానయ్య, అంకమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

జేవీవీ అధ్యక్షుడిగా శీనయ్య



నూతన కమిటీ

పొదలకూరు: జనవిజ్ఞాన వేదిక మండల నూతన కమిటీని స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా బి.శీనయ్య, జనరల్ సెక్రటరీగా వీవీవీ కల్యాణ్, గౌరవాధ్యక్షుడిగా నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆర్.పోలయ్య, ఎం.రవి, కోశాధికారిగా ఎ.నాగయ్య, కార్యదర్శులుగా నారాయణ, కోడూరు వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కోర్టు అనుమతితో విచారణ



పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వస్తున్న అరుణ

కోవూరు: గిరిజనులను మోసం చేసిన కేసులో నిడిగుంట అరుణను కోర్టు అనుమతితో కోవూరు పోలీసులు సోమవారం విచారణ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోవూరు పంచాయతీ నాగలకట్ట కాలనీలో నివసిస్తున్న 21 గిరిజన కుటుంబాలు తమకు ఇళ్ల పట్టాలు వస్తాయనే ఆశతో అరుణకు డబ్బులు చెల్లించారు. అయితే పట్టాలు అందకపోవడంతో మోసపోయామన్న అనుమానంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కోర్టు అనుమతి తీసుకుని నిందితురాలు అరుణను స్టేషన్‌కు రప్పించారు. కోవూరు సీఐ సుధాకర్ రెడ్డి సమగ్ర విచారణ చేపట్టారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి, అరుణను నెల్లూరు జైలుకు తరలించారు.

అక్కా.. అమ్మానాన్న జాగ్రత్త

- 112కు ఫోన్ చేయడంతో యువకుడిని కాపాడిన పోలీసులు



యువకుడిని అప్పగిస్తున్న పోలీస్

కోవూరు: 'అక్కా... నేను చనిపోతున్నాను. అమ్మానాన్న జాగ్రత్త' అంటూ తన తమ్ముడు ఫోన్ చేసి పెట్టేశాడు. కంగారు పడిన ఆమె 112 కాల్‌కు చేయడంతో సకాలంలో స్పందించిన పోలీసులు అతడిన్ని కాపాడారు. నెల్లూరు బీవీ నగర్‌కు చెందిన స్వరూప తన తమ్ముడు కందల వంశీ శ్రీనివాసులు మానసిక ఆవేదనతో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సోమవారం ఉదయం 8:20 గంటల సమయంలో 112 నంబరుకు కాల్ చేసి సమాచారం అందించింది. దీంతో క్షణాల్లో స్పందించిన కోవూరు సీఐ వి.సుధాకర్‌రెడ్డి నేతృత్వంలోని పోలీసులు సాంకేతిక ఆధారంగా వంశీ ఫోన్ లొకేషన్‌ను ట్రాక్ చేశారు. కొడవలూరు మండలం రామన్నపాళెం రైల్వేట్రాక్ వద్ద అతడు ఉన్నట్లు గుర్తించడంతో వెంటనే సిబ్బందిని అక్కడికి పంపించి వంశీని కాపాడి అతని అక్క స్వరూపకు అప్పగించారు.

ఆటోకు నిప్పు

నెల్లూరు(క్రైమ్): ఆటోకు నిప్పంటించిన ఘటన జాఫర్ సాహెబ్ కాలువకట్ట వద్ద సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. జాఫర్ సాహెబ్ కాలువ కట్ట వద్ద ఆటో యజమాని వెంకటేశ్వర్లు నివాసం ఉంటున్నారు. ఆయన తన ఆటోను డేవిడ్ అనే వ్యక్తికి రోజువారీ అద్దెకు ఇచ్చారు. ఈ క్రమంలోనే వారి మధ్య మనస్పర్థలు చోటుచేసుకోవడంతో అతన్ని వెంకటేశ్వర్లు దూరం పెట్టారు. ఈ క్రమంలో డేవిడ్ సోమవారం తెల్లవారుజామున వెంకటేశ్వర్లు ఇంటి ముందు నిలిపి ఉన్న ఆటోకు నిప్పంటించి పరారయ్యారు. ఈ ఘటనలో ఆటో పాక్షికంగా దెబ్బతింది. ఈమేరకు బాధితుడు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నెరవేరని లక్ష్యం

- చెరువుకు చేరాల్సిన నీరు వాగులకు..
- రూ.లక్షలు ఖర్చు చేసినా ప్రయోజనం శూన్యం
- పట్టించుకోని జలవనరుల శాఖ



వర్షాలకు సప్లయ్ చానల్ పొంగి బయటకు ప్రవహిస్తున్న నీరు

పొదలకూరు: పొదలకూరులో అంతంతమాత్రంగా కురుస్తున్న వర్షాలకు భూగర్భ జలాలు ఏమాత్రం పెరగడం లేదు. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో బోర్లలో నీరు అందడం లేదు. పొదలకూరు చెరువు వరవ కాలువ గుండా చెరువుకు చేరాల్సిన నీరు వృథాగా వాగుల్లోకి చేరుతోంది. భారీ వర్షాలు కురిసేలోగా కాలువకు మరమ్మతులు చేపడితే చాలావరకు ఉపయోగం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

అందువల్లే..

గతంలో చెరువు సప్లయ్ చానల్ మరమ్మతులకు నీరు – చెట్టు పథకంలో జలవనరుల శాఖ అధికారులు రూ.13 లక్షలు విడతల వారీగా ఖర్చుపెట్టారు. తర్వాత పంచాయతీ నిర్వాహకులు కూడా మురుగు కాలువను తలపిస్తున్న వరవ కాలువ బాగు కోసం నిధులు వెచ్చించారు. ఇటీవల కూడా కాలువకు మరమ్మతులు చేసినట్టు అధికారులు వెల్లడించారు. అయితే లెవల్స్ లేకుండా పూడిక పనులు చేపట్టడంతో వర్షపునీరు చెరువులోకి చేరడం లేదు. దీంతో రైతుల ప్రయోజనాలు నెరవేరడం లేదు.

పట్టించుకోకపోవడంతో..

పట్టణానికి సమీపంలోని శ్రీనివాస లేఅవుట్ వద్ద నున్న సప్లయ్ చానల్ నుంచి నీళ్లు దిగువ భాగానికి పారేందుకు వాలు లేదు. దీంతో లేఅవుట్ గుండా పొట్టేళ్ల వాగులోకి ప్రవహిస్తున్నాయి. అంతేకాక పట్టణం నడిబొడ్డున ఉన్న కాలువ ఆక్రమణలతో కుంచించుకుని ఉంది. ఫలితంగా కాలువ గుండా చెరువుకు నీరు వెళ్లేందుకు వీలు లేకుండా ఉంది. ఈ సప్లయ్ చానల్ సుమారు 1 కి.మీ నిడివితో నెల్లూరు మార్గం నుంచి ప్రారంభమై పొదలకూరు చెరువు వరకు ఉంది. చెరువుకు ఈ కాలువ గుండా మాత్రమే నీరు చేరేందుకు (క్యాచ్‌మెంట్) అవకాశం ఉంది. అయితే జలవనరుల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ఏటా నీటి వృథా జరుగుతూనే ఉంది.

భూగర్భ జలాలు పెరిగే అవకాశం

పొదలకూరు చెరువులో నీటి నిల్వ ఉంటే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది. ప్రధానంగా పట్టణానికి నీటిని సరఫరా చేసే గుర్రాపు బావి వద్ద నున్న బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతాయి. ఇందువల్ల వేసవిలో పట్టణంలో తాగునీటి ఎద్దడిని నియంత్రించేందుకు వీలవుతుంది. అయితే చెరువుకు చేరాల్సిన నీరంతా వాగు గుండా పార్లపల్లి చెరువుకు చేరుతున్నాయి. భారీ వర్షాలు కురిసేలోగానైనా జలవనరులశాఖ అధికారులు లెవల్స్ పెట్టించి కాలువ పూడిక తొలగించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



పట్టణం మీదుగా వెళుతున్న పూడికతో నిండిన సప్లయ్ చానల్

పోలేరమ్మ దేవస్థాన వార్షికోత్సవం నేడు



పొదలకూరు: పట్టణంలోని పోలేరమ్మ తల్లి దేవస్థాన వార్షికోత్సవ వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని నిర్మాణ దాత పుకోటి లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం జరుగుతాయన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాల్సిందిగా కోరారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న వెంకమరాజు

తోటపల్లిగూడూరు: రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు అన్నారు. మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం 4వ మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా వెంకమరాజు మాట్లాడుతూ అన్నదాతలకు కనీస ప్రభుత్వ ప్రోత్సాహం కరువైందన్నారు. వ్యవసాయ పెట్టుబడులు గణనీయంగా పెరిగిపోతున్నా కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలు లభించడం లేదన్నారు. వ్యవసాయం తప్ప వేరే పని తెలియని రైతన్నలు చేసిన అప్పులు తీర్చలేక పంట పొలాల్లో ఉరితాళ్లకు బలవుతున్నారన్నారు. ఉపాధి హామీ పథకం సైతం వ్యవసాయ కార్మికులకు అండగా లేదన్నారు. గ్రామాల్లోని కూలీలు వ్యవసాయేతర పనుల కోసం పట్టణ ప్రాంతాలకు వలస వెళ్తున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

⇨ మండల కమిటీ నూతన అధ్యక్షుడిగా ఉండ్రాల శీనయ్య, కార్యదర్శిగా పచ్చా మధు, సభ్యులుగా బండి శౌరి, ఈపూరు లక్ష్మయ్య, కొండయ్య, చిన్నబ్బయ్య, వెంకటయ్య, వెంకటసుబ్బయ్య, వెంకమ్మ, శ్రీదేవి నియమితులయ్యారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి మంగళం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పది గంటల పని విధానం దారుణం



మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

తోటపల్లిగూడూరు: పది గంటల పని విధానాన్ని అమలు చేసేలా అసెంబ్లీలో తీర్మానించడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నరుకూరు సెంటర్‌లో నిరసన కార్యక్రమం జరిగింది. స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి నరుకూరు సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ 8 గంటల పని విధానాన్ని కూటమి ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. పునరాలోచించి ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మారుబోయిన రాజా, సీపీఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ట్రెజరర్ మధుసూదనమ్మ, హేమ, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ మండల కార్యదర్శి శీనమ్మ, సీపీఎం నాయకులు బండి శౌరి, ఉండ్రాళ్ల శీనయ్య, ఆటో యూనియన్ నాయకులు రఘు, బాషా, శీను తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు(బారకాసు): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకంలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహాల మంజూరుకు అర్హులైన ప్రజలందరూ దరఖాస్తులు చేసుకోవాలని కమిషనర్ నందన్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎన్‌ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ పాల్గొని, అర్జీదారుల నుంచి వినతి పత్రాలను అందుకున్నారు. టిడ్కో గృహాలకు సంబంధించి స్థానిక సచివాలయాన్ని సందర్శించి దరఖాస్తుకు అవసరమైన పూర్తి వివరాలను పొందాలని సూచించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కాగా పీజీఆర్ఎస్ ద్వారా 46 వినతులు స్వీకరించామని వెల్లడించారు. విభాగాల వారీగా అకౌంట్స్– 2, ఇంజినీరింగ్– 6, రెవెన్యూ–2, పబ్లిక్ హెల్త్–2, హౌసింగ్–20, టౌన్ ప్లానింగ్–8, హెచ్ సెక్షన్–3, ఆప్కాస్–3 చొప్పున వినతులు వచ్చాయి. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి, సిటీ ప్లానర్ హిమబిందు, మేనేజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

నెల్లూరు(బారకాసు): దసరా ఉత్సవాల నేపథ్యంలో రాజరాజేశ్వరి దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. స్థానిక రాజరాజేశ్వరి దేవస్థాన ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను ఆయన సోమవారం పర్యవేక్షించారు. అనంతరం 46వ డివిజన్ ముత్తరాజువారి వీధిలో కాలువల పూడికతీతపై పలు సూచనలు చేశారు. స్థానికంగా రోడ్డును ఆక్రమిస్తూ ఏర్పాటు చేసిన దుకాణ యజమానికి రూ.5 వేల అపరాధ రుసుము విధించి, వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రంకురోడ్డు అర్చన థియేటర్ నుంచి నర్తకి థియేటర్ వరకు ఉన్న కాలువలను పరిశీలించారు. స్థానిక దుకాణదారులు వ్యర్థాలను కాలువల్లో వేయకుండా డస్ట్‌బిన్లను వినియోగించాలన్నారు. ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో నిరుపయోగంగా ఉన్న ఫౌంటైన్లను, సులబ్ కాంప్లెక్స్ నిర్వహణను తనిఖీ చేశారు. రంగనాయకులపేటలో పినాకిని పార్కు అభివృద్ధి పనులను పరిశీలించారు. జాఫర్‌సాహెబ్ కెనాల్ ప్రాంతంలో స్మార్ట్ స్ట్రీట్ బజార్ చివరి దశ పనులను పర్యవేక్షించారు. ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ రహంతు జానీ, ఎంహెచ్ఓ డాక్టర్ కనకాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

పొదలకూరు: మండలంలోని ఉలవరపల్లి గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీపై సోమవారం పోలీసులు కేసు మోదు చేశారు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన చాంద్‌బాషా పొలంలో ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ చోరీకు గురైంది. గుర్తించిన రైతు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రామచంద్రాపురంలో స్వచ్ఛభారత్

బుచ్చిరెడ్డిపాళెంరూరల్: నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురంలో బీజేపీ నాయకులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వీధులు శుభ్రం చేశారు. మురుగు కాలువల్లో చెత్తను తొలగించారు. మొక్కలు నాటారు. రామిశెట్టి కల్యాణ్‌కుమార్, శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు కాసా శ్రీనివాసులు, బీజేపీ జిల్లా కార్యదర్శి నాగవేణి పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

పొదలకూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఉదయం కలశ స్థాపన, ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆదూరు వెంకటసుబ్బయ్య, ఆదూరు సునీల్‌లు వ్యవహరించారు. సాయంత్రం లలితా సహస్రనామార్చన, వివిధ పూజలు చేశారు. పట్టణంలో కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు మొదలయ్యాయి. నవరాత్రులు పూర్తయ్యేంత వరకు తెల్లవారుజామున ప్రత్యేక అభిషేకాలు ఉంటాయని అర్చకుడు ప్రసాద్‌స్వామి తెలిపారు.

⇨ మండలంలోని మరుపూరు గ్రామంలో కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఉత్సవాలను ప్రారంభించారు. తొలిరోజు ఉభయకర్తలుగా వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి – ప్రసూనమ్మ వ్యవహరించారు.

⇨ పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో తొలిరోజున అమ్మవారు వీరలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

⇨ మండలంలోని ఇనుకుర్తి ఆదిపరాశక్తి కాంతమ్మ తల్లి ఆశ్రయంలో అమ్మవారు శ్రీస్వర్ణ దుర్గా అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

⇨ **మనుబోలు:** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు మండల కేంద్రమైన మనుబోలులో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దళితవాడలోని చెన్నకేశవ ఆలయాన్ని విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. దేవతామూర్తుల కటౌట్లు ఆకట్టుకున్నాయి. కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు బాలా త్రిపురసుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా యారాసి రవికుమార్ – శివలక్ష్మి దంపతులు వ్యవహరించారు.



పొదలకూరు: కన్యకాపరమేశ్వరి అలంకరణలో అమ్మవారు

గంగపట్నంలో..

ఇందుకూరుపేట: శరన్నవరాత్రులను పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి అమ్మవారు సోమవారం బాలా త్రిపుర సుందరిగా భక్తులను కటాక్షించారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. తొలిరోజు కార్యక్రమాలకు మావులూరు హరితమ్మ జ్ఞాపకార్థం భర్త, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులు రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు శ్రీధర్‌రెడ్డి, గిరిజమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు. అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్ స్వామి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. రాత్రి పల్లకిసేవ వైభవంగా జరిగింది. ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద కోలాహలం నెలకొంది. మైపాడు, ఇందుకూరుపేట, కొత్తూరు, పల్లిపాడు తదితర గ్రామాల్లో దసరా వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి.



ఇందుకూరుపేట: చాముండేశ్వరీదేవి ఆలయంలో..

వేడుకగా కలశ స్థాపన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో కలశ స్థాపనతో సోమవారం నవరాత్రులు ప్రారంభమయ్యాయి. భక్తులు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పెన్నానది నుంచి అర్చకులు పవిత్ర జలాలు తీసుకొచ్చారు. అనంతరం ఆలయంలో కలశ స్థాపన చేసి అమ్మవారి నవరాత్రులను ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు.



మనుబోలు: బాలా త్రిపురసుందరి అలంకరణలో..



మనుబోలు: విద్యుద్దీపాల వెలుగులో చెన్నకేశవ ఆలయం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పెన్నానది నుంచి పవిత్ర జలాలు తీసుకొస్తున్న అర్చకులు

మెప్మా మార్కెట్ ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కు వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మార్కెట్‌ను చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెలా పొదుపు సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు మెప్మా ఆధ్వర్యంలో మార్కెట్‌ను ఏర్పాటు చేశామన్నారు. నగర ప్రజలు ఇక్కడి మార్కెట్‌లోని వస్తువులను కొనడం ద్వారా నగదు ఆదాతో పాటు నాణ్యమైన వస్తువులు దక్కించుకోవచ్చని సూచించారు.

పోషకాహారంతో రక్తహీనతకు చెక్



గర్భిణులు, బాలింతలకు అవగాహన

కొడవలూరు: పోషకాహారంతో రక్తహీనత సమస్యకు చెక్ పెట్టొచ్చని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.రామకృష్ణ సూచించారు. మండలంలోని రేగడిచెలికలో పోషకాహార ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలకు సోమవారం అవగాహన కల్పించారు. చిన్న పిల్లలకు సకాలంలో టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అన్ని సౌకర్యాలు ఉంటాయన్నారు. సర్పంచ్ ఎస్.శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి టి.నారాయణరావు, మహిళా పోలీస్ వినీల విక్టోరి, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.విజయలక్ష్మి, టి.రాజేశ్వరి, ఎ.అమరావతి, కె.చెంచమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ బ్రిజిత

కొడవలూరు: మహిళల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ బ్రిజిత అన్నారు. స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రేగడిచెలికలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించి 40 మంది మహిళలకు అన్నిరకాల వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యకరంగా ఉంటే కుటుంబం, సమాజం బాగుంటుందన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం దీనిని ప్రవేశ పెట్టిందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.రామకృష్ణ, సీహెచ్ఓ టి.సోమశేఖర్, హెచ్ఏ ఒ.సుధాకర్, ఏఎన్ఎంలు షీలా, దీనమ్మ, పెంచలమ్మ, రాధా, రాధిక, ఎంఎల్‌హెచ్‌పీలు రేష్మ, సుష్మ, పద్మజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల పరామర్శ



చిన్నారులను పరామర్శిస్తున్న సీపీఐ నాయకులు

ఇందుకూరుపేట: పెరమన దుర్ఘటనలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను సీపీఐ నాయకులు సోమవారం పరామర్శించారు. ఇందుకూరుపేట దళితవాడకు చెందిన శ్రీనివాసులు– లక్ష్మి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వారి పిల్లలు అనాథలయ్యారు. ఈ క్రమంలో చిన్నారులను స్థానికంగా కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం వారికి రూ.25 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు షాన్‌వాజ్, మున్వర్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

భూములతో వ్యాపారం చేస్తున్నారు

- సీపీఐ ఆందోళన



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ముత్తుకూరు(పొదలకూరు): మండలం రాష్ట్రంలోనే పెద్ద పారిశ్రామికవాడగా గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ ఇక్కడ కొందరు భూములతో వ్యాపారం చేస్తున్నట్లు సీపీఐ నాయకులు ఆరోపించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి నియోజకవర్గ కార్యదర్శి తుంగా ఏడుకొండలు మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం రిలయన్స్ కంపెనీ 3 వేల ఎకరాల భూముల సేకరించి ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదన్నారు. అదే కోవలో కొందరు పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని కారుచౌకగా భూములను కొనుగోలు చేసి అమ్ముకుంటున్నట్లు ఆరోపించారు. పరిశ్రమలు నెలకొల్పుతారని రైతులు భూములను అప్పగించారన్నారు. పరిశ్రమలు రాకపోగా రైతుల భూములు ఎందుకు పనికి రాకుండా పోతున్నట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ స్వప్నకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ముజీబ్‌బాషా, సభ్యులు ప్రసాద్, బాబు, విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పగటిపూట భారీ వాహనాల నిషేధం



లారీ అసోసియేషన్ నాయకులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(క్రైమ్): పగటిపూట భారీ వాహనాలకు నగరంలో ప్రవేశం లేదని నార్తు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సూచించారు. నార్త్‌ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో స్టోన్‌హౌస్‌పేటకు చెందిన సింహపురి వాణిజ్య మండలికి చెందిన లారీ అసోసియేషన్‌తో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. నగరంలోని స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధి, రేబాలవీధిలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతున్న దృష్ట్యా భారీ వాహనాలు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 8 గంటల్లోపు లోడింగ్, అన్‌లోడింగ్ చేసుకోవాలని ఆయన చెప్పారు. పగటిపూట భారీ వాహనాలకు ప్రవేశం లేదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.